


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
ఆగస్టు 24, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-



## వందేళ్ల ప్రణాళికతో హైడ్రా

'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో
హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్

# ఇబ్బందైతే కొనకండి!

**చమురు ఉత్పత్తులపై ట్రంప్ సర్కార్‌కు తెగేసి చెప్పిన విదేశాంగ మంత్రి జైశంకర్**

**స్వప్రయోజనాలతో కూడిన అధికారిక వ్యాపారం మీది!**

**మాది వ్యాపారమంటారా?**

**ట్రంప్ విదేశాంగ విధానం పూర్తిగా అగమ్యగోచరం**

**ముందు సొంతిల్లు దిద్దుకోండి అమెరికాకు పదునైన చురకలు**



న్యూఢిల్లీ: భారత్ నుంచి ముడి చమురు సహా పలు రకాల శుద్ధిచేసిన ఉత్పత్తులను కొనడం మీకు ఇబ్బంది అనుకుంటే అస్సలు కొనొద్దని ట్రంప్ సర్కార్‌కు భారత విదేశాగ మంత్రి జైశంకర్ తెగేసి చెప్పారు. ట్రంప్ పాలనాయంత్రాంగం అనుక్షణం స్వప్రయోజనాలతో వాణిజ్యంచేస్తూ భారత్ సైతం అదేపనిచేస్తుంటే తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉందని జైశంకర్ వ్యాఖ్యానించారు. పలుదేశాలపై ఎడాపెడా

(మిగతా 2వ పేజీలో)



## యూరియాపై ఆందోళన వద్దు

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి పునరుద్ధరణపై మార్గనిర్దేశం

సచివాలయంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు సమీక్ష

హైదరాబాద్: యూరియా సరఫరా ను పెంచేందుకు మా ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)

(మిగతా 2వ పేజీలో)



## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

**ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన అసెంబ్లీ స్పీకర్**

**4 వారాల్లోగా సమాధానం ఇవ్వాలని గడువు**

హైదరాబాద్: పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై అక్టోబర్ 31లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శాసనసభ స్పీకర్‌కు సూచించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసుల జారీ ప్రక్రియను స్పీకర్ ప్రారంభించారు. నోటీసులు అందుకున్న వారు నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నట్లు తెలిసింది.

**ఢిల్లీకి స్పీకర్ ప్రసాద్‌కుమార్**

ఢిల్లీలో జరిగే ఆలిండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ నేతృత్వంలోని బృందం శనివారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరింది.

(మిగతా 2వ పేజీలో)

# స్థానిక సంస్థల ఎన్నికలపై కమిటీ

**సభ్యులుగా భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం, సీతక్క**

**సుదీర్ఘ చర్చ అనంతరం ఎన్నికలకు నిర్ణయం.. బీసీ రిజర్వేషన్లపై విస్తృత అభిప్రాయ సేకరణ 26 కల్లా నివేదిక**

**అధికారికంగా ఇవ్వగలమా? పార్టీ పరంగా ఇచ్చి వెళ్దామా అనే అంశాలను తేల్చనున్న కమిటీ**

**ఎన్నికలకు ఎలా వెళ్లాలన్న దానిపై పీఏసీ సభ్యుల భిన్నాభిప్రాయాలు .. న్యాయ నిపుణులతో చర్చిస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి**

**బీసీలకు రిజర్వేషన్ల కల్పనపై 3 ఆప్షన్లను చర్చించామన్న మంత్రి ఉత్తమ్ .. సుప్రీంకు వెళ్లేది లేదు.. : సీఎం**



పీఏసీ సమావేశంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం ఒక్కశాతం కూడా అదనంగా బీసీలకు రిజర్వేషన్ రాదని, కానీ బీసీలకు మేలు జరగాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. అందు కోసమే చట్టాన్ని సవరించి ఆర్డినెన్సు తెచ్చామని, ఆ ఆర్డినెన్సును గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారని చెప్పారు. రాష్ట్రపతికి పంపిన బిల్లులను 90 రోజుల్లో ఆమోదించాలన్న అంశంపై సుప్రీంకోర్టులో మన వాదనలను వినిపించేందుకు ఇద్దరు న్యాయవాదులను నియమించామని చెప్పారు.

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను వీలున్నంత త్వరగా నిర్వహించడానికే కాంగ్రెస్ పార్టీ మొగ్గుచూపుతోంది. ఈ విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేయడం వల్ల కాలయాపన తప్ప ప్రయోజనం లేదని ఆ పార్టీలోని కీలక నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), సలహా కమిటీల సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. సమావేశంలో భాగంగా పలువురు సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు కొందరు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలకు వెళదామని సూచించగా, మరికొందరు మాత్రం అధికారికంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే మంచిదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇదే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన గడువులోపు స్థానిక ఎన్నికలు పూర్తిచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అధికారికంగా ఇవ్వగలమా లేదంటే పార్టీపరంగా ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలా అనే అంశంపై న్యాయ నిపుణులతో సలహాలు, సంప్రదింపులు జరిపి పార్టీకి నివేదిక ఇచ్చేందుకుగాను ఐదుగురు మంత్రులతో ప్రత్యేక కమిటీని నియమించాలని పీఏసీ నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్,

(మిగతా 2వ పేజీలో)



## ఆ తీర్పు నా ఒక్కడిది కాదు

సుప్రీం కోర్టు 'సల్వాజుడుం' తీర్పు విషయంలో అమిత్‌షాతో వాదించబోను

విపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సాయుధ సల్వాజుడుం వ్యవస్థను సుప్రీంకోర్టు వ్యతిరేకించడం వల్లే నక్సలిజం ఇంకా ఉనికిలో ఉందని, దీనికి పరోక్షంగా సుదర్శన్‌రెడ్డి కారణమని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా చేసిన

(మిగతా 2వ పేజీలో)




## సిరిసిల్ల నేతన్నలకు అండగా నిలవండి: కెటిఆర్

హైదరాబాద్ : సిరిసిల్ల నేతన్నలకు అండగా నిలవాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక భట్టి విక్రమార్కకు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎంఎల్ఎ కెటిఆర్ లేఖ రాశారు. సిరిసిల్లలోని పవర్‌లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని పేర్కొన్నారు. పవర్‌లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ. 101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి

(మిగతా 2వ పేజీలో)

## శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద



# అధికారిక లాంఛనాలతో నేడు సురవరం అంతిమయాత్ర



**మఖ్దూంభవన్ నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు..**

హైదరాబాద్/గచ్చిబౌలి: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి అంతిమయాత్ర ఆదివారం నిర్వహించనున్నారు. అమెరికా నుంచి ఆయన పెద్దకుమారుడు రావాల్సి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో పలువురు సీపీఐ జాతీయ, రాష్ట్ర నేతలు సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పించారు. శనివారం ఉదయం వారంతా ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో

(మిగతా 2వ పేజీలో)

# స్థానిక సంస్థల ఎన్నికలపై కమిటీ




సీఎం రేవంత్‌రెడ్డిలతో చర్చించిన అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ కమిటీని అధికారికంగా ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని, దేశంలోని న్యాయ నిపుణులు, పార్టీ నాయకులతో కమిటీ విస్తృతంగా చర్చించి ఈ నెల 26వ తేదీలోపు నివేదికను ఇస్తుందని మహేశ్‌గౌడ్ వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపిన బిల్లు ప్రకారం అధికారికంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించగలమా? లేదా పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి ముందుకెళ్లాలా అనే అంశాలపై ఈ కమిటీ నివేదిక ఇవ్వనుంది.

### ఆరు ప్రధాన అంశాలే ఎజెండాగా భేటీ

సమావేశంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలు, హైకోర్టు కోర్టు తీర్పు నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు గల ఆప్షన్లు, ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోరీ, గద్దీ చోడ్ ఉద్యమాన్ని రాష్ట్రంలో విస్తృతంగా చేపట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలు, రాష్ట్రంలో యూరియా కొరత, రాజకీయ పరిణామాల గురించి చర్చించారు. సమావేశానికి ముందు ఏఐసీసీ చేపట్టిన ఓట్‌చోరీ ప్రచార లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఇండియాకూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయడం పట్ల సమావేశం హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పార్టీ సీనియర్ నేతలు జానారెడ్డి, వీహెచ్, కేకే, జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌లతోపాటు పలువురు మంత్రులు, పీఏసీ సభ్యులు పాల్గొన్నారు.

### లోతుగా చర్చించి నిర్ణయం తీసుకున్నాం: డిప్యూటీ సీఎం భట్టి

పీఏసీ భేటీ అనంతరం సీనియర్ మంత్రి ఉత్తమ్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌లతో కలిసి భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన, 50 శాతం రిజర్వేషన్ల పరిమితి గురించి పీఏసీ లోతుగా చర్చించిందని చెప్పారు. సెప్టెంబర్ 31 వరకు స్థానిక ఎన్నికల నిర్వహణపై ఎలా ముందుకెళ్లాలన్న దానిపై సుదీర్ఘంగా పలువురు సభ్యుల అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అధికారికంగా వెళ్లాలా... పార్టీ పరంగా వెళ్లాలా అనే అంశాలపై చర్చించడంతోపాటు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని, ఇందుకోసం కమిటీని నియమించాలని, ఈనెల 28వ తేదీలోపు కమిటీ నివేదిక ఇవ్వాలని పీఏసీ నిర్ణయించిందని చెప్పారు. కమిటీలో సభ్యులపై టీపీసీసీ అధ్యక్షుడు అధికారికంగా నిర్ణయం తీసుకుంటారన్నారు. న్యాయ నిపుణులతో కమిటీ చర్చించి పార్టీకి నివేదిక ఇచ్చిన అనంతరం కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని స్థానిక ఎన్నికల విషయంలో ముందుకు వెళతామని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అన్ని రాజకీయ పార్టీలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరుతూ పీఏసీలో తీర్మానించినట్టు వెల్లడించారు. దేశంలోని పౌరుల ఓటు హక్కును కాపాడడం, ఓట్ల చోరీని అరికట్టేందుకు బిహార్‌లో రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్రపై పీఏసీలో చర్చ జరిగిందని, ఆ పోరాటానికి పీఏసీ సంపూర్ణంగా మద్దతు తెలిపిందన్నారు. ఈనెల 26న పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు వెళ్లనున్నట్టు చెప్పారు.

### విస్తృతంగా చర్చిస్తాం: మంత్రి ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇటు స్థానిక సంస్థల ఎన్నికలు, అటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల గురించి ఎలా ముందుకెళ్లాలన్న దానిపై మూడు ఆప్షన్లను పీఏసీ భేటీలో చర్చించామని చెప్పారు. ఈ విషయంలో విస్తృత స్థాయిలో పార్టీ నేతలతోపాటు న్యాయ నిపుణులతో మాట్లాడుతామని వెల్లడించారు. అభిషేక్ మనుసింఘ్వి, జస్టిస్ సుదర్శన్‌రెడ్డిలతోపాటు రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌లను అధికారికంగా అభిప్రాయం అడుగుతామని తెలిపారు.

### ఘన విజయానికి అవకాశం: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన అద్భుతమైన ఫలితాలనిస్తోందని, జనహిత పాదయాత్రలో భాగంగా వెళ్లినప్పుడు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించే అవకాశం ఇప్పుడు పార్టీకి ఉందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, పార్టీ గెలుపు కోసం ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని చెప్పారు.

### బీసీలకు మేలు జరగాల్సిందే: సీఎం రేవంత్

పీఏసీ సమావేశంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం ఒక్కశాతం కూడా అదనంగా బీసీలకు రిజర్వేషన్ రాదని, కానీ బీసీలకు మేలు జరగాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. అందు కోసమే చట్టాన్ని సవరించి ఆర్డినెన్సు తెచ్చామని, ఆ ఆర్డినెన్సును గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారని చెప్పారు. రాష్ట్రపతికి పంపిన బిల్లులను 90 రోజుల్లో ఆమోదించాలన్న అంశంపై సుప్రీంకోర్టులో మన వాదనలను వినిపించేందుకు ఇద్దరు న్యాయవాదులను నియమించామని చెప్పారు. ఆ కేసులోనే రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లు అంశం కూడా వస్తుందని, ప్రత్యేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చెప్పారు. ఒకవేళ అలా వెళ్లే కేసు లిస్టు కావడానికే చాలా సమయం పడుతుందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసినందుకుగాను మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 26న బిహార్‌లో రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న ఓట్‌చోరీ పాదయాత్రకు హాజరవుతానని, రాష్ట్రంలో కూడా ఓట్‌చోరీ ఉద్యమాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్, బీజేపీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని, యూరియా ఇచ్చే పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిస్తానని కేటీఆర్ చెప్పడంలోనే వారి తీరు అర్థమవుతోందన్నారు. యూరియా కోసం తాను నాలుగుసార్లు కేంద్ర మంత్రులు నడ్డా, అనుప్రియా పటేల్‌లను కలిశానని వెల్లడించారు.

# వందేళ్ల ప్రణాళికతో హైడ్రా

హైదరాబాద్ : హైడ్రా వందేళ్ళ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని.. భవిష్యత్తు తరాలకు నీటివనరులను, ప్ర భుత్వ ఆస్తులను అందించే దిశగా ప్రణాళికలను రూపొందించుకుని ముందుకుసాగుతుందని హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ చెప్పారు. హైడ్రా చర్యలు తాత్కాలిక ఫలితాలనిచ్చేవి కాదనీ, శాశ్వత పరిష్కారం చేస్తున్నదనీ, మనకు మన పూర్వికులు ఇచ్చిన సహజ సంపదను.. మనం భవిష్యత్తు తరాలకు అందించేట్టుగా చర్య లు తీసుకోవడం జరుగుతుందని రంగనా థ్ పేర్కొన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల యూనియన్ శనివారం నిర్వహించిన "మహానగర అభివృద్ధి ఆటంకాలు" అంశంపై 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో రంగనాథ్ మాట్లాడుతూ.. చెరువుల్లోకి ఈపాటికే వచ్చిన ని ర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదనీ, ఇప్పుడు చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లలోకి కొత్తగా వస్తున్న నిర్మాణాలపై చర్య లు తప్పకుండా తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం చెరువు ఖాళీ ప్రాంతాల కు కంచెలు వేస్తూ చెరువులకు రక్షణ క ల్పిస్తూ.. ఇకముందు ఆక్రమణలు, అక్ర మ నిర్మాణాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వెల్లడించారు. ప్రయోగాత్మకంగా ఆరు చెరువులను పునరుద్ధరిస్తున్నామని, దశల వారిగా మిగతా చెరువులను అభివృద్ధి పరుస్తామని, సిఎస్ఆర్ పద్ధతిలో చాలా సంస్థలు ముందుకు వస్తున్నాయని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఇప్పటి వరకు 900 చెరువులకుగానూ 135 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ జారీచేసి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌ల హద్దులను నిర్ధారించడం జరిగిందని.. మిగతా చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ జారీచేసేందుకు శాస్త్రీయ, సాంకేతి క పద్ధతులను అనుసరిస్తున్నామనీ, సర్వే ఆఫ్ ఇండియా,ఎన్ఆర్ఎస్‌సి, విల్లేజ్ మ్యాప్‌లు, రెవెన్యూ రికార్డుల నుండి స మాచారాన్ని సేకరిస్తున్నామని త్వరలోనే మిగతా చెరువులకుకూడా ఫైనల్ నోటిఫికేషన్ జారీచేస్తామని రంగనాథ్ వివరించారు. సల్కం చెరువులోని ఫాతిమా కళాశాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తున్నామని, మల్లారెడ్డి, పల్లరాజేశ్వర్‌రెడ్డికి చెందిన కళాశాలలు ఉన్న నీటి వనరులకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా తీసుకుంటున్నామని, ఆ సమాచారం మేరకు చర్యలు ఉంటాయని రంగనాథ్ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఒక వర్గం వారికి మెప్పుగా.. మరో వర్గం వారికి తప్పుగా హైడ్రా వ్యవహరించడం లేదనీ, హైడ్రా చర్యలపై పలు రకాల విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయనీ, అయినా.. చట్టం ప్రకారంగా నోటీసులు జారీచేస్తూ చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ప్రస్తుతం కూకట్‌పల్లి నల్లచెరువు పునరుద్దరణ చూసిన స్థానికులు హైడ్రా తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా నిలుస్తున్నారని రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్లో వరదలు, మురుగునీటి సమస్యలు, చెరువుల కబ్జాలు, పర్యావరణ సమస్యలు వంటి క్లిష్ట అంశాల పరిష్కారానికి గత ఏడాది జూలైలో హైడ్రా అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసిందని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. అకాల వర్షాల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ, చెరువులు –నాలాలను రక్షించడం హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ చెప్పారు. నాలాల్లో వేలాది ట్రక్కుల పూడికతీత పనులు చేశామన్నారు. సిబ్బంది చేతనే మ్యాన్ హోల్స్, నాలాలు క్లీన్ చేయించాం.

# ఇబ్బందైతే కొనకండి!

పన్నుల పిడిగుద్దులు కురిపించే ట్రంప్ అవలంభించే విదేశాంగ విధానం పూర్తిగా అగమ్యగోచరంగా తయారైందని ఎద్దేవాచేశారు. ఢిల్లీలో జరుగుతున్న 'వరల్డ్ లీడర్స్ ఫోరమ్'లో ఆయన అతిథిగా పాల్గొని పలు అంశాలపై నిర్మొహమాటంగా మాట్లాడారు. "మా సరుకు కొనాలని మీపై ఒత్తడి చేయట్లేదు కదా. మీరు భారతీయ చమురు ఉత్పత్తులను కొనకపోతే వేరే దేశాలు కొంటాయి. సరు కులను యూరప్ అమ్ముతుంది. అమెరికా కూడా అమ్ముతుంది. భారత్ సైతం అమ్ముతుంది. మావి వద్దనుకుంటే, సమస్య అనుకుంటే కొనకుంటే సరిపోతుంది కదా"అని జైశంకర్ వ్యాఖ్యానించారు.'అమెరికా సంప్రదాయక విదేశాంగ విధానానికి ట్రంప్ తిలోదకాలిచ్చారు. ఏ దేశం గురించి ఆయన ఏం అనుకుంటున్నారో ఎవ్వరికీ తెలీదు. అసలు ట్రంప్ సారథ్యంలో అమెరికా విదేశాంగ విధానం అగమ్యగోచరంగా, అధ్వానంగా తయారైంది. ఇలాంటి విదేశాంగ విధానాన్ని, ఇంత బాహాటంగా అమలుచేసిన అమెరికా అధ్యక్షుడిని ప్రపంచం కనీవినీ ఎరుగదు. సొంత వ్యాపారం, వాణిజ్యం పెంచుకోవడంపైనే ట్రంప్ సర్కార్ దృష్టిపెడుతుందని అందరూ అంటారు. మరి అలాంటప్పుడు భారత్ వంటి దేశాలు రష్యా వంటి దేశాలతో వాణిజ్యం చేస్తుంటే మీకొచ్చిన ఇబ్బంది ఏంటి?. మీరు చేస్తున్న పనిని వేరొకరు చేయొద్దనడం హాస్యాస్పదం. సొంతింటిని గాలికొదిలేసి పక్కింట్లో ఏం జరుగుతుందా అని ట్రంప్ యంత్రాంగం తొంగి చూస్తుంటే నవ్వొస్తోంది. ముందు మీ ఇంటిని చక్కదిద్దుకోండి"అని ట్రంప్‌కు జైశంకర్ చురకటించారు.

# అధికారిక లాంఛనాలతో నేడు సురవరం అంతిమయాత్ర

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి పాల్గొన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఇతర బీఆర్ఎస్ నేతలు సురవరం కుటుంబసభ్యులను ఖాజాగూడలోని గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్స్‌లో కలిసి పరామర్శించారు. ఆయన్ను కలిసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపీ కేవీపీ.రామచందర్‌రావు కూడా సురవరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కేర్ ఆస్పత్రి నుంచి సురవరం భౌతిక కాయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యాలయమైన మఖ్దూంభవన్‌కు తరలిస్తారు. ప్రజల సందర్శనార్థం అక్కడే ఉంచుతారు. సాయంత్రం అక్కడి నుంచే సురవరం అంతిమయాత్ర గాంధీమెడికల్ కాలేజీ వరకు సాగుతుంది. వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ మెడికల్ కాలేజీకి సురవరం భౌతిక కాయాన్ని అప్పగిస్తారు. ఇప్పటికే ఆయన కళ్లను ఎల్‌వీప్రసాద్ కంటి ఆస్పత్రికి ఇచ్చారు. సురవరం అంతిమయాత్రకు ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో ఏర్పాట్లు చేస్తోంది.

### నేడు నివాళులు అర్పించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆదివారం ఉదయం 10 గంటలకు మఖ్దూమ్‌భవన్‌కు చేరుకొని సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పిస్తారు. సీఎంతోపాటు పలువురు మంత్రులు కూడా పాల్గొంటారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నదని సీపీఎం సీనియర్ నేత పాటూరి రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

### అణగారిన వర్గాల కోసం తపించిన నేత సురవరం

అణగారిన వర్గాల కోసం అనేక సామాజిక ఉద్యమాలు నిర్వహించి, జీవితాంతం పేదల కోసం పరితపించిన మహనీయుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ నేతలు కొనియాడారు. మఖ్దూంభవన్‌లో సురవరం చిత్రపటానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నేతలు చాడ వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ.నరసింహ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### సురవరం మృతిపట్ల పలువురి సంతాపం

హైదరాబాద్: సురవరం సుధాకరరెడ్డి మృతిపట్ల కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తదితరులు సంతాపం తెలిపారు. సౌమ్యుడు, మృదుస్వభావి, పీడిత వర్గాల అభివృద్ధి కోసం తుది శ్వాస వరకు పనిచేసిన నాయకుడు సురవరం అని కిషన్‌రెడ్డి కొనియాడారు. సుధాకరరెడ్డి మరణం తెలుగు ప్రజలకు తీరనిలోటని బండి సంజయ్, బండారు దత్తాత్రేయ, ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి కమ్యూనిస్టు వేగుచుక్క అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి కొనియాడారు. సురవరం బలహీనవర్గాల హక్కులకోసం అవిశ్రాంతంగా పోరాడారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. మతోన్మాదం పెరిగిపోతున్న ఈ తరుణంలో సురవరం మృతి వామపక్ష ఉద్యమాలకు, ప్రజాస్వామ్య హక్కులకు తీరని నష్టమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విచారం వ్యక్తం చేశారు.



# ఎయిమ్స్‌లో స్థానికులకు ఉద్యోగాల అవకాశాలు కల్పించాలి

## బిఆర్ఎస్ పార్టీ బీబీనగర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాల పంపిణీ

యాదాద్రి వార్త ప్రతినిధిఎయిమ్స్ లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సోమవారం జరగబోయే నిరసన దీక్ష కు బీబీనగర్ గ్రామ ప్రజలు తరలిరావాలని. బిఆర్ఎస్ పార్టీ బీబీనగర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గోలి సంతోష్ రెడ్డి గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కరపత్రాలను విడుదల చేసి ఇంటింటికి కరపత్రాలు అందజేయడం జరిగింది. సోమవారం నాడు ఎయిమ్స్ ముందర జరగబోయే నిరసన దీక్ష ముఖ్య ఉద్దేశం, ఎయిమ్స్ లో ఉద్యోగాలు స్థానికులకె ఇవ్వాలని, ఉద్యోగాలు అమ్ముకుంటున్న ఎయిమ్స్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని శాంతియుత నిరసన దీక్షకు బీబీనగర్ గ్రామ ప్రజలందరూ తరలివచ్చి నిరసన దీక్షకు మద్దతు తెలపాలని. తద్వారా రాబోయే రోజులలో గ్రామస్తులకే ఉద్యోగాలు వచ్చే విధంగా ఈ దీక్షను విజయవంతం చేయాలని కోరడం జరిగింది. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద

నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,818, ఎంజీకేఎల్ఐ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో 16.480 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 13.750 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. కాగా, నాగార్జున సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా 3,61,322 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,414 క్యూసెక్కులు మొత్తం 3,94,736 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువ కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

స్పీకర్‌తోపాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులుతోపాటు పలువురు అసెంబ్లీ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. 1925లో భారతదేశ సెంట్రల్ లేజిస్లేటివ్ అసెంబ్లీకి స్పీకర్‌గా ఎన్నికైన మొదటి భారతీయుడు విఠల్ బాయి పటేల్ బాధ్యతలు స్వీకరించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆగస్టు 24, 25 తేదీల్లో ఢిల్లీలో స్పీకర్ల సదస్సును నిర్వహిస్తున్నారు. ఇటీవలే కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ భేటీకి హాజరుకావడం లేదని మండలి వర్గాలు చెప్పాయి.

# యూరియాపై ఆందోళన వద్దు

యాజమాన్యం, వ్యవసాయ, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులతో శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై మంత్రులు ఆరా తీశారు. ఈ సీజన్‌లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పనిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్‌ను మంత్రులు ప్రశ్నించారు. 'మిమ్మల్ని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదు. రాష్ట్రాభివృద్ధిలో మాతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నాం'అని స్పష్టం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దన్నారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్ఎఫ్‌సీఎల్ మాతృసంస్థ ఎన్ఎఫ్ఎల్‌కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతీరోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో మీకేమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. సమీక్షలో స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆర్ఎఫ్‌సీఎల్ యూనిట్ హెడ్, జీఎం రాజీవ్ పాల్గొన్నారు.

# ఆ తీర్పు నా ఒక్కడిది కాదు

విమర్శలపై విపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి విభేదించారు. శనివారం పీటీఐకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. "సిద్ధాంతాలకు అతీతంగా ప్రజలందరి ప్రాణాలు, ఆస్తులు కాపాడే హోం మంత్రి అమిత్ షాతో నేరుగా వాగ్వాదం పెట్టుకోదల్చుకోలేదు. 2011 డిసెంబర్‌లో సల్వాజుడుంను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగా ఆ తీర్పు కాపీని నేనే రాశాను. కానీ ఆ అభిప్రాయం నాది కాదు. అది సుప్రీంకోర్టు అభిప్రాయం. తీర్పు పూర్తిపాఠం అమిత్ షా చదవి ఉండకపోవచ్చు. అందుకే ఆయన నన్ను విమర్శిస్తున్నారు. 40 పేజీల ఆ తీర్పు మొత్తాన్నీ చదివితే సుప్రీంకోర్టు తీర్పు సారాంశం ఆయనకు ఖచ్చితంగా అవగతమవుతుంది. ఇంతకు మించి నేనేమీ చెప్పదల్చుకోలేదు. ఇంతటితో ఈ అంశంపై చర్చ ముగిస్తే బాగుంటుంది"అని సుదర్శన్ రెడ్డి వ్యాఖ్యానించారు. నక్సలిజాన్ని అంతంచేయాలనే ఏకైక లక్ష్యంతో ఆనాటి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గిరిజన యువతకు తుపాకులిచ్చి సల్వా జుడుం(కోయ కమెండోలు) పేరితో సాయుధ వ్యవస్థను అమలుచేయగా, ఇది చట్టవిరుద్ధమని ఈ సాయుధ పౌర మిలటరీ వ్యవస్థను వెంటనే నిర్వీర్యంచేయాలని సుప్రీంకోర్టు ఆనాడు చరిత్రాత్మక తీర్పు చెప్పింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉన్నారు. దీంతో నక్సలిజం పట్ల సుదర్శన్ రెడ్డికి సానుభూతి ఉందని, అందుకే అలా తీర్పిచ్చారని అమిత్ షా శుక్రవారం ఆరోపించడం తెల్సిందే. "రాజ్యాంగం సవాళ్లను ఎదుర్కొంటోంది. సవాళ్లతో సతమతమవుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తా. పార్లమెంట్‌లో సభ్యుల నిరసన కారణంగా సభా కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలగడం సహజం. నిరసన అనేది అత్యావశ్యకం. కానీ అదే పనిగా నిరసన తెలపడం అనేది సమస్యాత్మకంగా మారుతుంది. గతంలో వాణిజ్యలోటు గురించి జనం మాట్లాడుకునేవాళ్లు. ఇప్పుడు మన ప్రజాస్వామ్యంలో సైతం లోటు కన్పిస్తోంది. మొదట్నుంచీ భారత్ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంగా పరిఢవిల్లినప్పటికీ నేడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ఇలాంటి సందర్భాల్లో రాజ్యాంగంపై దాడి అనే అంశంపై ఖచ్చితంగా చర్చించాల్సిందే. ప్రజాస్వామ్యం అంటే వ్యక్తుల మధ్య పోటీ కాదు. సిద్ధాంతాల మధ్య పోటీ మాత్రమే. ఎప్పుడైనా సరే ప్రభుత్వం, విపక్షం మధ్య సఖ్యత చెడిపోకూడదు. జాతి ప్రయోజనాల దృష్ట్యా అది చాలా ముఖ్యం. విపక్షాలు ఏకగ్రీవంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎన్నుకోవడం నిజంగా నాకు దక్కిన గొప్ప గౌరవం. నా ఎంపిక అనేది మూడు అంశాలను స్పష్టంచేస్తుంది. ఒకటి వైవిధ్యం. విపక్షంలోని వివిధ పార్టీలు నన్ను ఎన్నుకున్నాయి. రెండో ఏకగ్రీవ ఎన్నిక. ఇక మూడోది దీటైన ఓటింగ్ సామర్థ్యం. ఒకరంగా విశ్లేషిస్తే దేశ జనాభాలో దాదాపు 63 శాతం జనాభాకు ఈ పార్టీలు ప్రాతినిధ్యంవహిస్తున్నాయి. ఇంతకుమించిన గౌరవం ఏముంటుంది"అని ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

## ఘనంగా బి ఎస్ రాములు జన్మదినం వేడుకలు.

### శుభాకాంక్షలు తెలిపిన బి సి యువజన సంఘం రాష్ట్ర నాయకులు



కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, ఆగష్టు 23 : తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కి నిరంతరం కృషి చేసిన మహనీయులు బి ఎస్ రాములు అని బి సి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ అన్నారు. నేడు శనివారం రోజున జగిత్యాల పట్టణము లోని ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ పి జీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర బి సి కమిషన్ మొట్ట మొదటి చైర్మన్ బి ఎస్ రాములు జన్మదినం పురస్కరించుకొని బి సి యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం గోపికృష్ణ మాట్లాడుతూ రాములు సర్ జన్మదినం లో మేము పాల్గొనడం మా అదృష్టంగా భావిస్తూ రాములు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని, బి సి ల స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ల సాధనకై తమ వంతుగా కృషి చేయాలని వారిని ఈ సందర్భంగా కోరారు .ఇట్టి జన్మదిన వేడుకల కార్యక్రమంలో ఎస్ కె ఎన్ ఆర్ డిగ్రీ , పి జీ కళాశాలల సంయుక్త ప్రిన్సిపాల్ అశోక్ బి సి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్ బి సి యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు .



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### ::: జిల్లెల్ల మాజీ సర్పంచ్ రాములు

కల్వకుర్తి ఆగస్టు 23 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం అనారోగ్యంతో నాప రాములమ్మ మరణించడం జరిగింది. మృతి విషయం తెలుసుకున్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ"3 వేలు ఆర్థిక సహాయం చేశారు. మృతురాలి కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ దేవాలయ చైర్మెన్ రవిగౌడ్,వైస్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి,మాజీ కోఆప్షన్ నెంబర్ బాల్ జంగయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లెల్ల ఎస్సీ సెల్ మహేందర్, మాజీ వార్డ్ నెంబర్ పాండురంగారెడ్డి, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు నాపమల్లయ్య, మాజీ వార్డ్ నెంబర్ ఆంజనేయులు, శ్రీశైలం, శ్రీహరి, రమేష్, జంగయ్య, తోటపల్లి నరసింహ, ఆంజనేయులు, పాల్గొన్నారు.



## మిర్యాలగూడ మండలంలో ముమ్మరంగా పనుల జాతర

మిర్యాలగూడ , ఆగస్టు 23:- (వార్త మిర్రర్) పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ మండలంలో 36 పశువుల పాకలు ఉపాధి హామీ పథకం కింద మంజూరయ్యాయని ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ తెలిపారు. అందులో 7 ములకలకాలువ, అన్నారం, తక్కెళ్ళపాడు గ్రామాలలో ఒక్కొక్కటి చొప్పున గోగువారిగూడెం, రుద్రారం గ్రామాలలో రెండు చొప్పున మొత్తం 7 పశువులపాకలకు మార్కౌట్ చేసి ప్రారంభించారు. గౌరెలపాక ఊట్లపల్లి గ్రామంలో ఒకటి ప్రారంభించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు రెండు ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో డ్రైన్ ఎండ్ పాయింట్ కమ్యూనిటీ సోక్ పిట్స్ 48 మంజూరయ్యాయన్నారు.. అందులో 32 ప్రగతిలో ఉన్నవి.%జా% మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అంగన్వాడి భవనాలు%శ్రీ% తక్కళ్లపాడ్, వెంకటాద్రిపాలెం రెండు గ్రామాలలో ఒక్కొక్కటి రూ.12 లక్షల అంచనాలతో, వెంకటాద్రిపాలెం, జాలుబాయి తండాలో గ్రామపంచాయతీ భవనాలు రెండు ఒక్కొక్కటి 20 లక్షల అంచనాలతో, తక్కళ్లపాడు బాలికల మండల ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్స్ రూ.2 లక్షల అంచనాలతో జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. పనుల జాతర సందర్భంగా గ్రామపంచాయతీ ములకలకాలవ గ్రామసభ నిర్వహించి100 రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి హామీ పథకం వేజ్ సీకర్ కు గ్రామపంచాయతీ పరిధిలో ఉత్తమ సేవలందించిన మల్టీ పర్పస్ వర్కర్లకు సన్మానించారు. ఉపాధి హామీ పథకం కింద పశువుల పాకకు మార్కింగ్ చేశారు. స్వచ్ భారత్ మిషన్ నిధులతో డ్రైన్ ఎండ్ పాయింట్ కమ్యూనిటీ సోక్ పిట్ పని ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం కింద జాలుబాయి తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణం రూ. 20లక్షలతో చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్పిఓ రాఘవరావు, ఇజిఎస్ ఎపిఓ కళావతి, టిఏ పురుషోత్తం, వెంకన్న పంచాయతీ కార్యదర్శి, ఆంజనేయులు ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్: చైర్మన్ ఉప్పల వెంకటేష్

కల్వకుర్తి ఆగస్టు 23 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మండలంలోని ముకురాల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఇంజమూరి ఈశ్వరయ్య హఠాత్తుగా మరణించడం జరిగింది.ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త నరేందర్ రెడ్డి, యాపర్ల నరేందర్ రెడ్డి శ్రీను గౌడ్, మల్లేష్, శరత్, రవి, వినోద్,జంగయ్య, చెక్కల మల్లేష్ పాల్గొన్నారు.

# సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే "ఉల్లాస్" లక్ష్యం



కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, ఆగష్టు 23.కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు' ఉల్లాస్( నవ భారత అక్షరాస్యత కార్యక్రమం) పై కోరుట్ల మండలంలోని 15 గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు మరియు గ్రామైక్య సంఘం సహాయకులకు(వి ఓ ఏ) శిక్షణ జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేంద్ర,రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుందని సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసాన్ని అందించడం మరియు 15 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా నైపుణ్యాలను అందించడంపై దృష్టి పెడుతుందని, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత మరియు ఆరోగ్య అవగాహన వంటి కీలకమైన జీవిత నైపుణ్యాలను అందిస్తుందని,పాఠశాల విద్యను కోల్పోయిన లేదా నిరక్షరాస్యులైన పెద్దలను (15 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గలవారు)2027 సంవత్సరం నాటికి 100% అక్షరాస్యత లక్ష్యంగా పని చేస్తుందని,(యు ఎల్ ఎల్ ఏ ఎస్) మొబైల్ యాప్ లో అభ్యాసకుల పురోగతిని అంచనా వేయడానికి (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్) వంటి మూల్యాంకనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి కె.మహేష్,మండల విద్యాధికారి గంగుల నరేశం,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వి.గంగాధర్,రిసోర్స్ పర్సన్స్ అందె శివప్రసాద్,అంకం దామోదర్,అన్నం మహేష్,వి.ఓ.ఏ లు,సి.ఆర్.పిలు పి. గంగాధర్ ,దేవేందర్, సత్యనారాయణ, జ్యోతి,మన్విత, పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల బందోబస్తుపై అధికారులతో రాచకొండ సిపి సుధీర్ బాబు వీడియో కాన్ఫరెన్స్

### శాంతి భద్రతల విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలి


### రౌడీ షీటర్, సంఘ విద్రోహశక్తుల పైన నిఘా వెయ్యాలి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు, ఐపీఎస్. అధికారులతో సిపి ఆఫీసు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారికి సూచనలు, దిశానిర్దేశం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుపుకొనే అతిపెద్ద ఉత్సవాల్లో ఒకటైన వినాయక చవితి వేడుకలు ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడా అవాంఛిత సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన విషయంలో నిర్వాహకులతో, అధికారులు ముందుగానే సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. గణేష్ వేడుకల్లో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలని, ఆయా ప్రాంతాల్లోని పౌరవిభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.రానున్న గణేష్ నవరాత్రోత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన రాచకొండ పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్యశాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా సజావుగా జరుపుకునేలా చూడాలన్నారు.నిమజ్జనానికి వచ్చే వారితో మర్యాదగా ఉండాలని, శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సీపీ సూచించారు. ఇన్ స్పెక్టర్లు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. డయల్ 100 కాల్స్ కు సత్వరమే స్పందించాలని, సీసీ టీవీలను విస్తృతంగా వినియోగించాలని, విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.మండపాల్లో డిజే ఏర్పాటుకు అనుమతి లేదని మండపం నిర్వహకులు, కమిటీలకు అధికారులు వివరించి చెప్పాలని సూచించారు. భక్తుల సందర్శనను దృష్టిలో వుంచుకుని మండపాలలో క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల్లో షార్ట్ సర్క్యూట్ జరగకుండా చోరవ తీసుకొవాలని,కరెంట్ షాక్ కొట్టకుండా మండపాల వద్ద ప్లాస్టిక్ పరదాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న గణేష్ మండపం నిర్వాహకుల కమిటీ వివరాలు తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, సరఫరాలో అంతరాయం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొవాలని ఆదేశించారు.రౌడీ షీటర్, సంఘ విద్రోహశక్తులమిద మీద నిఘా ఉంచాలని సూచించారు. వినాయక మండపాల దగ్గర ఎటువంటి సమస్యలు, ఘర్షణలు లేకుండా చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాలు వుంటే బందోబస్తును పెంచాలని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలందరూ గణేశ్ ఉత్సవాలను ఘనంగా, శాంతియుతంగా జరుపుకోవాలని,గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు, నిమజ్జనోత్సవానికి అవసరమైన పోలీస్ బందోబస్తు, స్విమ్మర్స్, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత శాఖల సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.అదేవిధంగా రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పరిస్థితిని పర్యవేక్షించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు.నిమజ్జనం సందర్భంగా జిహెచ్ఎంసి అధికారుల సమన్వయంతో ముందుగానే చెరువులు, ఇతర నిమజ్జన నీటి కుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు కట్టల వద్ద టెంట్లు, విద్యుత్ లైట్లను, బారికేడ్లను నిర్మించాలని, మంచి నీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయాలన్నారు. ప్రజలు, భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతు పనులు, శానిటైజేషన్ పనులను చేపట్టాలన్నారు. గణేష్ వేడుకలను నిర్విఘ్నంగా, ఘనంగా, గౌరవప్రదంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. భద్రతాపరంగా పోలీసులు పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉన్నారన్నారు. డీసీపీ ఎస్బి జి నరసింహ రెడ్డి, డిసిపి క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎస్బి, సీసీఆర్బి ఏసిపిలు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## విద్యానగర్ కాలనీ వాసుల కోసం తన సొంత స్థలాన్ని ఉచితంగా ఇస్తాను

### బీజేపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి రామ్ భూపాల్ రెడ్డి



కల్వకుర్తి ఆగస్టు 23 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ ఒకటో వార్డులో సి.సి.రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్,మురికి కాలువ సమస్యలతో సతమతమవుతున్న కాలనీవాసులు ఈ సమస్యను కాలనీ ప్రజలు బిజెపి నాయకులు రా0 భూపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఒకటో వార్డ్ కాలనీ వారికోసం ఏ సహాయం చేయడానికేనా తను సిద్ధంగా ఉన్నానని ఇంతకు ముందు కల్వకుర్తి చైర్మన్ స్థానిక ఎమ్మెల్యే కమిషనర్ సమక్షంలో విద్యానగర్ లో కాలనీ సమస్య కోసం సుమారు 50 నుండి 60 లక్షలు ఉన్న విలువైన స్థలాన్ని ఇస్తానని మాట ఇచ్చానని ఆ మాట ప్రకారం ఎప్పుడైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.ఇటీవల కురిసిన వర్షాలకీ వరద నీరు చేరి కాలనీ వాళ్లు బయటికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని, అలాగే విపరీతమైన పిచ్చిచెట్లు ఉండడం వల్ల విష కీటకాలకు రావడంతో పాటు విష కీటకాలకు విద్యానగర్ కాలనీ నిలయంగా మారిందని ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే అధికారులు స్పందించి తక్షణమే విద్యానగర్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించాలనిఆయన కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మురికి కాలువ లేక వరద నీళ్లు చేరి రెండు మూడు రోజులు ఇంట్లో నుండి బయటికి వెళ్లకుండా నరకం చూసామని స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు సమస్యను పరిష్కరిస్తామని ఇప్పటివరకు కూడా పరిష్కరించలేదని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బీజేపి రా0 భూపాల్ రెడ్డి ఎన్నో లక్షల రూపాయల విలువైన స్థలాన్ని కాలనీ ప్రజల కొరకు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తక్షణమే విద్యానగర్ కాలనీ సమస్యను పరిష్కరించాలని పరిష్కరించకపోతే రాస్తారోకో ధర్నాలు చేయడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విద్యానగర్ కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై కాప్రా డిసి జగన్ నిర్లక్ష్యం

**మూడు రోజుల ముందు కో-ఆర్డినేషన్ సమావేశం .. గైరాజరైన వివిధ శాఖల ఉన్నతాధికారులు.. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా పవర్ కట్**

**సమావేశంలో కనిపించిన విద్యుత్ శాఖ.. తూతూ మంత్రంగా గణేష్ ఉత్సవ కో ఆర్డినేషన్ సమావేశం**

**కరువైన సమన్వయం-అసంతృప్తి వ్యక్తం చేసిన మంటప నిర్వాహకులు.. అధికారుల తీరుపై విరుచుకుపడ్డ నేతలు .. కనీస సమాచారం ఇవ్వని అధికారులు**





కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు 23:గణేష్ ఉత్సవాల కో ఆర్డినేషన్ సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది.అధికారుల తీరుపై అన్ని వర్గాల వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కో ఆర్డినేషన్ పేరుతో ఏర్పాటు చేసిన సమావేశంలో సమన్వయం పూర్తిగా కొరవడింది.అధికారులు సమాచారం ఇవ్వడంలో విఫలమయ్యారని ఆరోపణలు వినిపించాయి. కాప్రా సర్కిల్ స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణ కోఆర్డినేషన్ సమావేశాన్ని ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేశారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బొంతు శ్రీదేవి యాదవ్, ప్రభుదాస్,కాప్రా డిసి జగన్,ఈఈ నాగేందర్, కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి,సిఐ భాస్కర్ రెడ్డి,డిజీఎం సతీష్ కుమార్,ట్రాఫిక్ సిఐ రాజు తదితరులు హాజరయ్యారు.ఈ సమావేశంలో మంటపాల నిర్వహకులు పలు సమస్యలను ఎత్తిచూపారు. ప్రతి ఏటా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ధ్వజమెత్తారు.గణేష్ మండపాల అనుమతుల పేరిట అధికారులు వేధిస్తున్నారని విమర్శించారు. గణేశుని ఎత్తు గురించి అధికారులు నిబంధనలు పెట్టడం సరికాదన్నారు.కనీసం రోడ్లు,వీధిదీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు,చెట్ల పొమ్మలు తొలగించే విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.నిమర్జనం సందర్భంగా కాప్రా,చర్లపల్లి చెరువులలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు.సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు రాకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. గణేష్ పండుగ సమయం దగ్గర పడుతున్న ఈ తరుణంలో సమావేశం ఏర్పాటు చేసి ఏం సాధిద్దామని కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారని నిలదీశారు.కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం అయింది.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సైతం డిప్యూటీ కమిషనర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రామంతపూర్ లో ఆరుగురు మృతి చెందిన సంఘటన నేపథ్యంలో కనీసం విద్యుత్ అధికారులు హాజరు కాకపోవడంలో అంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నించారు.మొత్తం మీద అసంతృప్తితో కో ఆర్డినేషన్ సమావేశం ముగిసింది.ఈ సమావేశంలో కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి,బొంతు శ్రీదేవి యాదవ్,జేరిపోతుల ప్రభుదాస్,శాంతి సాయి జన్ శేఖర్,నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, రాఘవరెడ్డి,కొత్త అంజిరెడ్డి,పనగట్ల చక్రపాణి గౌడ్, నిర్గొండ సతీష్ బాబు,రేగుల సతీష్ రెడ్డి,సీతారాం రెడ్డి,రాములు యాదవ్,మర్రి మోహన్ రెడ్డి, చల్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**:: డీజే లకు అనుమతి లేదు**



మిర్యాలగూడ, ఆగస్టు 23:- (వార్త మిర్రర్) మిర్యాలగూడలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించి అన్ని మతాలు, కులాలు కలిసి ఉన్నారని రాష్ట్రానికి మంచి సందేశం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కోరారు. శనివారం స్థానిక ఐఎంఎ భవనంలో గణేష్ చవితి వేడుకలు, నిమజ్జనంపై శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపల్, విద్యుత్ అధికారులు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. గణేష్ వేడుకలు, నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేయవద్దని కోతులు, కుక్కలు నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గణేష్ మార్కెట్ 15వార్షికోత్సవ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అన్నారు. ఎలాంటి డిజె అనుమతి లేదు పెట్టవద్దని నల్లగొండ అదనపు కలెక్టర్ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ అన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగిన తెలపాలన్నారు. నిర్వాహకులు రాత్రి వేళ మండపాల్లో ఒకరిని కాపలా పెట్టాలని డిఎస్పీ కె. రాజశేఖరరాజు కోరారు. ఊరేగింపు



ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్టు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలను నిమజ్జనంకు తీసుకు రావద్దన్నారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా చేస్తామని మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. ఏడాదికోసారి జరిగే ఉత్సవానికి పట్టణంలో డీజే అనుమతి నివ్వాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి కోరారు. పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పట్టణం శాంతికి నిలయం అన్ని పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. పోటి పడి భారీ విగ్రహాల వల్ల ఇబ్బంది పడవద్దని డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు అన్నారు. అందరి సహకారం తో ఉత్సవాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రేపాల పురుషోత్తం రెడ్డి అన్నారు. మునిసిపల్ అధికారులు సమావేశంలో రాకపోవడం విచారకరమని బిజెపి నాయకులు బంటు సైదులు పేర్కొనగా సబ్ కలెక్టరేట్ సమావేశంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్ణయం తీసుకున్నామని డిఎస్పీ కె.రాజశేఖర్రాజు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.సురేష్ కుమార్, విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసచారి, మిర్యాలగూడ ఒన్, టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్లు సిహెచ్. మోతిరాం, సోమనర్సయ్య, పిఎన్డి.ప్రసాద్, ఎస్ఐలు సైదిరెడ్డి, ఎం.లక్ష్మయ్య, చల్ల వెంకటేశ్వర్లు, హరీష్ రెడ్డి, నియోజకవర్గం క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముండ్లగిరి కాంతయ్య, జమాతే అవామ్ అధ్యక్షుడు ఎంఎ.సమిఖాద్రి, ముఫ్తి ఎండి.ఉమర్ లు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కి నివాళులర్పించిన సిపిఐ నాయకులు

మిర్యాలగూడ , ఆగస్టు 23:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ సిపిఐ కార్యాలయంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలిపారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా మొదలైన రాజకీయ ప్రస్థానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, నల్లగొండ పార్లమెంటు సభ్యులు, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బడుగు బలహీన అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆహర్నిశలు ప్రజా పోరాటాలు చేసి సిపిఐ ముందు భాగంలో ఉండుటకు ఆయన వంతు కృషి చేసే వారన్నారు. ఆయన తుది శ్వాస వరకు మీరు చూపిన పోరాట పటిమ రాబోయే తరాలకు దిక్సూచి మరణం సిపిఐకి తీరని లోటుని వారన్నారు కమ్యూనిస్టు పార్టీ ఒక ధ్రువతారను కోల్పోయినదన్నారు. ఆశయ సాధన అజా రామరమన్నారు. విప్లవ జోహార్లు జోహార్ రెడ్ స్టార్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి జోహార్ జోహార్లర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శిలు జిల్లా యాదగిరి పోలేపల్లి ఉదయ్ కుమార్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగ నాయక్



మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబోతు పద్మ వర్కింగ్ ప్రెసిడెంట్ డి శాంతి, సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్కే షమీం, సమాఖ్య నాయకురాలు బంటు రాజేశ్వరి ఎర్రమాద సులోచన సమితి సభ్య లు ఎర్రమాద శ్రీనివాస్ రెడ్డి, బసక పరమేష్ రవినాయక్ పాల్గొన్నారు

## చలో ఇంద్రపార్క్ ఈనెల 25న ఆర్ కృష్ణన్న చేపడుతున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

**బీసీలకు 42% రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి లేకుంటే యుద్ధమే**

**బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్**

ప్రత్యేక ప్రతినిధి (వార్తా మిర్రర్ ) ఆగస్టు 23:బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలని ఈ నెల 25న ఇందిరాపార్కు వద్ద బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణన్న చేపడుతున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని భువనగిరిలో విద్యార్థులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, జిల్లా ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు సింగనబోయిన మల్లేశం పాల్గొన్నారు వారు మాట్లాడుతూ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చినవన్నీ అమలు చేయాలి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు పోవాలి లేకపోతే యుద్ధమే బీసీలు అంటే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే భావిస్తున్నార మ్మెల్యేలు మీరే ఎంపీలు మీరే ముఖ్యమంత్రి మీరే బీసీలు సర్పంచులు అయితే కూడా ఓరోలేరా ఇదేనా మీ ప్రజాపాలన బీసీలు రాజకీయంగా 14% దాటలే ఉద్యోగ పరంగా 12% దాటలేదు 60 శాతం ఉన్న బీసీలకు 79 సంవత్సరాలుగా అన్యాయమే జరుగుతుంది బిల్లుల అమలు విషయమై ప్రజా పోరాటంతో పాటు న్యాయపోరాటం కూడా చేయాల్సి ఉంది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన రెండు బీసీ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగులో వున్నాయి. మూడు నెలలు గడిచిపోయింది. ఆ బిల్లులను వారు తిరస్కరించడం గాని ఆమోదించడం గాని చేయలేదు. గతంలో ఇదే మాదిరి తమిళనాడు ప్రభుత్వం బిల్లులను గవర్నర్ కు పంపినప్పుడు గవర్నర్ సుదీర్ఘకాలం పాటు పెండింగ్ లో



పెట్టడం జరిగింది. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు పోవడం జరిగింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బిల్లు అంగీకరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని ఈనెల 25వ తేదీన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణన్న చేపట్టే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య,జిల్లా ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు సింగనబోయిన మల్లేశం, శ్రీరామ్, వైష్ణవి, భాస్కర్, శిరీష, ఉమా, మహాలక్ష్మి, రమణ, రమాదేవి, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగులకు స్వయం ఉపాధికి మంజూరైన యూనిట్ గ్రాంట్ పత్రాలను అందజేసిన ఎంపీడీఓ శర్మ, సీడీపీఓ మమత

మిర్యాలగూడ ఆగస్టు 23:-( వార్త మిర్రర్)మిర్యాలగూడ మండల పరిషత్ ఆవరణలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.శేషగిరి శర్మ, ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత దివ్యంగ అభ్యర్థులకు బెన్ఫిషరీ గ్రాంట్ పత్రాలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ శిక్షణ దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు అదేవిధంగా దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా స్వయంగా తమ వ్యాపారాన్ని తామే చేసుకునే విధంగా దోహదపడుతుందన్నారు రెడ్డిస్ ల్యాబ్ ఫౌండేషన్ దివ్యాంగుల స్వయం ఉపాధి కల్పన కొరకు మండలాన్ని యూనిట్గా తీసుకొని వివిధ గ్రామాల నుండి అర్హులైన 16 మంది దివ్యాంగ అభ్యర్థులను ఎంపిక చేసి వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందడానికి ఒక్కొక్క అభ్యర్థికి 25వేల రూపాయల విలువచేసే కుట్టు మిషన్లు, పిండి మిల్లులు మరికొన్ని యూనిట్లను ఫౌండేషన్ అందించడం చాలా అభినందించదగ్గ విషయం అన్నారు సమాజంలో అన్ని బాగుండి కూడా ఏమీ చేయకుండా ఇతరులపై ఆధారపడి బ్రతికేవారున్న ఈ రోజుల్లో దివ్యాంగులు తమ సొంత వ్యాపారంపై అభివృద్ధి చెందాలనే ఆలోచనతో శిక్షణ పొందిన దివ్యాంగ మిత్రులను అభినందిస్తున్నామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న దివ్యాంగ అభ్యర్థులకు బెనిఫిషరీ యూనిట్ గ్రాంట్ పత్రాలను అందజేశారు.



డాక్టర్ రెడ్డీ ఫౌండేషన్ డైరెక్టర్ పిఎన్ శ్రీనివాస్ దివ్యాంగులకు శిక్షణ తరగతులు నిర్వహించిన అనంతరం వ్యాపార అభివృద్ధికి కావలసిన మెలుకువల గురించి వివరించారు. కార్యక్రమంలో డిపిఎం రామలింగయ్య, ఏపిఎం దిలీప్ కుమార్, డాక్టర్ రెడ్డీ ఫౌండేషన్ కు చెందిన సాయితేజ, ఓంప్రకాష్, మహేష్, మణికంఠ వినయ్ పాల్గొన్నారు.

# పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలని కమీషనర్ శ్రీనివాస్ ను కోరిన టూ టౌన్ బిజెపి నేతలు

మిర్యాలగూడ , ఆగస్టు 23:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం లో అసంపూర్తిగా ఉన్న మౌలిక సదుపాయాలపై కమిషనర్ జి. శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా హనుమాన్ పేట ఫ్లైఓవర్ నుంచి రైల్వే ట్రాక్ వరకు రాత్రిపూట వీధి దీపాలు వెలగడం లేదన్నారు. రవీంద్రనగర్ ప్రాంతంలో వీధి దీపాలు మరియు రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదన్నారు. పలుచోట్ల పట్టణంలో అనేక సమస్యలు, ముఖ్యంగా నందిపాడు రోడ్డుటాకా రోడ్డు నుండి నందిపాడు బైపాస్ ఎక్స్ రోడ్ వరకు అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేస్తూ రోడ్డు డైవర్షన్ బోర్డు ఏర్పాటు చేయక, ప్రధాన రోడ్డు కావడం అధికారుల పర్యవేక్షణ లోపించడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందన్నారు. ఫాగింగ్, బ్లీచింగ్ చేయాలనీ, చాలా చోట్ల నల్లాలకు ఆన్ ఆఫ్ లేకపోవడంతో నీరు వృధాగా పోవడం తద్వారా దోమలు వ్యాప్తి పెరుగుతుండడం , విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరగా సమస్యలను పరిష్కరించి పట్టణ ప్రజలకు అన్ని రకాల మంచి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ టూ టౌన్ బీజేపీ అధ్యక్షులు పెద్ద బోయిన వీటియాదవ్, నాయకులు, నందికొండ హరిప్రసాద్, నిరంజన్రెడ్డి, కనపర్తి రాంప్రసాద్, కె.వేణు, చిలుకూరు శ్యాము, కొండేటి శేఖర్, భాష, సృజన , సోమలింగ యాదవ్, మేడి



నవీన్, సైదులు, జిల్లా నాయకులు రేపాల పురుషోత్తంరెడ్డి, టీ.హనుమంతరెడ్డి , బంటు సైదులు, ఎడ్ల రమేష్, సజ్జల నాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు సాధినేని శ్రీనివాస్ రావు, కనపర్తి సత్యప్రసాద్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం - కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం సత్తయ్య



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి ప్రజల సంక్షేమమే ప్రజా పాలన కాంగ్రెస్ ధ్యేయం అని చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సత్తయ్య అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, ఉచిత బస్సు సౌకర్యం, వ్యవసాయ దారులకు రైతు బంధు రైతు భరోసా పెట్టుబడి సాయం అలాగే తెలంగాణ ప్రజలకు వైద్య ఖర్చులు అత్యవసర సర్జరీలకు ఎల్వోసీలు ముఖ్యమంత్రి సహాయనిధి రూపంలో కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజల ప్రాణాలు కాపాడుతోందని ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి సహాయనిధి లాంటి పథకాలు గరిష్ఠంగా ప్రజలకు ఉపయోగపడాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మునుగోడు నియోజకవర్గంలో శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి పల్లె ప్రతి పట్టణం అభివృద్ధి చెందుతుందని గడ్డం సత్తయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు

## ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా సమీర్



మిర్యాలగూడ , ఆగస్టు 23:- (వార్త మిర్రర్) మిర్యాలగూడకు చెందిన విశ్రాంత సైనికుడు మోహమ్మద్ అబ్దుల్ సమీర్ భారత దేశ రక్షణ దళాలలో 17 సంవత్సరాలు విశేష సేవలందించి పదవీ విరమణ పొందారు.నల్గొండ జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఇటీవల జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.దేశ సేవలో తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన సమీర్ పదవీ విరమణ అనంతరం మాజీ సైనికుల సంక్షేమం కోసం కృషి చేయాలని సంకల్పించారు. మాజీ సైనికుల సమస్యలు, వారి కుటుంబాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు అందరికీ చేరే విధంగా కృషి చేస్తానని సమీర్ తెలిపారు.జిల్లా మాజీ సైనికుల సంఘం నాయకులు సమీర్ ని అభినందించారు.మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని సమీర్ హామీ ఇచ్చారు.



## మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణి

మిర్యాలగూడ , ఆగస్టు 23:-( వార్త మిర్రర్) వినాయక చవితి పండగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మిర్యాలగూడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణికి సిద్ధంగా ఉన్నాయని మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ విలేఖరులకు తెలిపారు. వచ్చిన విగ్రహాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణయే లక్ష్యంగా 4000 మట్టి గణపతులు తెప్పించామని ఆయన తెలిపారు. విగ్రహాలను పండగకు ఒక రోజు ముందు వినాయక భక్తులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ చే పంపిణి చేయిస్తామని తెలిపారు. ప్రజలు రసాయన రంగులతో సిద్ధం చేసిన విగ్రహాలకు దూరంగా ఉండాలని జలకాలుష్యం కాకుండా మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, మేనేజర్, రెవిన్యూ ఆఫీసర్ జి. జ్ఞానశ్వరి, సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేతలున్నారు.


## రైతులకు యూరియా సరఫరా చేయలేని ఈ ప్రభుత్వం ఉంటే ఎంత.? ఊడితే ఎంత.?

**ప్రభుత్వంపై బిజెపి నాయకులు డాక్టర్ నాటి మల్లేష్ గౌడ్ ఫైర్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులకు సకాలంలో యూరియా అందించలేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ఎండగాడుతూ భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మండల శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ నాటి మల్లేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయలేని ఈ ప్రభుత్వం ఉంటే ఎంత.? ఊడితే ఎంత.? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న, పత్తి, వరి పంటలకు ఇప్పుడు యూరియా వేయకుంటే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ చేయలేని ఈ ప్రభుత్వం, జిల్లాలో పంటలకు నష్టం జరిగి దిగుబడి రాకుంటే బాధ్యత ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యత వహించాలని అన్నారు ఇప్పటికైనా రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు




## మందకృష్ణ మాదిగ పోరాటానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**-రాజకీయ జెఏసీ శేరిలింగంపల్లి నాయకుల మద్దతు**

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : పెరేడ్ గ్రౌండ్ లో వికలాంగులు, వృద్ధులు, వితంతువుల ఫించన్ లు పెంచాలని డిమాండ్ చేస్తూ, సెప్టెంబర్ 9న హైదరాబాద్ పేరేడ్ గ్రౌండ్లో జరగబోయే మహాగర్జన సభను విజయవంతం చేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేస్తున్న పిలుపుకు విస్తృత మద్దతు లభిస్తోంది. శేరిలింగంపల్లి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాజకీయ జేఏసీ అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ గళం వెనుక ఉన్నది బలహీన వర్గాల ఆత్మగౌరవం. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న నిరంతర పోరాటానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాజకీయ జెఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం అన్నారు.అదే విధంగా రాజకీయ జెఏసీ నాయకులు కూడా ఈ పోరాటాన్ని బలపరుస్తూ, సెప్టెంబర్ 9 మహాగర్జన విజయవంతం కావాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పొందుతున్నా, పొందక పోయినా అందరూ ఒకటిగా మహాగర్జన సభలో పాల్గొని తమ హక్కు కోసం గళం వినిపించాలి అని పిలుపునిచ్చారు. మొత్తం మీద, మందకృష్ణ మాదిగ చేపట్టిన ఈ పోరాటానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాజకీయ జెఏసీ, శేరిలింగంపల్లి నాయకుల బలమైన మద్దతు లభించడం విశేషం అని ఏంఆర్ పిఎస్ శేరిలింగంపల్లి ఇంచార్జి శామ్లెట్ గణేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, నర్సింగ్, లలిత రాణి, విజయ లక్ష్మి, సంగమ్మ, వాసుకి, బాచుపల్లి బాలరాజు, రాయదుర్గం గణేష్ మాదిగ, హైదర్ నగర్ భూపతి మాదిగ, బిసి జేఏసీ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు
## గవ్వల బిక్షపతి యాదవ్ అకాల మరణం బాధాకరం

సంస్థాన్ నారాయణపూర్ ఆగస్టు 23( వార్త మిర్రర్) : నారాయణపురం గ్రామ చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గవ్వల బిక్షపతి యాదవ్ ఈరోజు ఉదయం అకాల మరణానిన్ని చింతిస్తూ పూలమాలలు వేసి సంతాపం ప్రకటించడం జరిగింది ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలు గుర్తించడం జరిగింది ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, కార్యదర్శి ఏపూరిసతీష్, మాజి సర్పంచ్ కొన్ రెడ్డి నరసింహ, సీనియర్ నాయకులు గుత్తా ప్రేమ్చందర్ రెడ్డి, జక్కిడి బాల్ రెడ్డి, ఎండి అక్బర్ ఆలీ, గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కిడి చంద్రారెడ్డి, జక్కలి యాదయ్య యాదవ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, మాజీ వార్డ్ నెంబర్ ఎండి ముస్తఫా ఖాన్, పెద్దగోని విష్ణు గౌడ్, బద్దుల మురళి యాదవ్, అంతటి స్వామి, సింగం కృష్ణ, రేవనపల్లి గోపాల్, గుత్తా శేఖర్ రెడ్డి, రేవనపల్లి బిక్షపతి, ఎండి వాజిద్, తదితరులు పాల్గొన్నారు



## అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో ని శిల్పారామం లో ని వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సంగీత నృత్య కథనం తో " శ్రీ కృష్ణ లీల అనుభవం" భాగవత కథలతో శ్రీ కృష్ణుడి నృత్యసంగీతకథ గ ప్రదర్శించారు శ్రీ రమాకాంత్ గాత్రం, నృత్యం పై నాగప్రాప్తి, జాహ్నవి, లక్ష్మి వైష్ణవి, సత్యశ్రీ, ఉర్షిత , హర్షిత లు , ధ్రువ వయోలిన్ పై, శ్యామకృష్ణ మ్రిదంగం, సంజన కథానుగానం చేసారు. సాయికృష్ణ డాన్స్ అకాడమీ గురువు శ్రీమతి ఉదయశ్రీ శిష్య బృందం భరత్నాత్యం నృత్య ప్రదర్శనలో గణపతి, శ్రీవిఘ్నారాజం, కాలభైరవాష్టకం, గరుడ గమన, అచ్యుతం కేశవం, రామాష్టకం, భద్రశైల, శివతాండవం,కృష్ణం, నమరామాయణం, రరవెను, మధుర మధుర , పారస్ తిల్లాన అంశాలను ఇంద్రాక్షి, ప్రణీత, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## ఆకలి తీరుస్తున్న హెూప్ ఫౌండేషన్ కొండ విజయ్ కుమార్
## 146 వారాల పాటు నిరంతర అన్నదానం..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ఒక గొప్ప సేవ. చందానగర్లో హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో అన్నదన కార్యక్రమం నిరంతరంగా చేస్తూ వస్తోంది. శనివారం, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 146వ వారాన్ని పూర్తి చేసుకుంది. ఈ ఒక్క రోజు సుమారు 2000 మంది పేదలు, నిత్యం కష్టపడి బతుకుతున్న కూలీలు కడుపునిండా భోజనం చేశారు. ప్రతి శనివారం ఉచిత భోజనం అందజేయడం పట్ల స్థానికులు, కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. 'రోజంతా కష్టపడితేగానీ పూట గడవదు. కానీ ప్రతి వారం ఇక్కడ ఉచితంగా భోజనం దొరుకుతోంది. ఇది మాకు గొప్ప ఊరట' అని ఒక కూలీ భావోద్వేగంతో చెప్పారు. ఆకలితో అలమటిస్తున్న ఎందరో జీవితాల్లో హెూప్ ఫౌండేషన్ ఒక 'ఆశ'నింపింది. ఈ కార్యక్రమంపై స్థానికులు కూడా ప్రశంసలు కురిపించారు. 'ఏ ఆర్భాటాలు లేకుండా, నిశ్శబ్దంగా తమ సేవలను కొనసాగిస్తున్న హెూప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో హెూప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## దేశంలో ప్రాథమిక హక్కులు అమలు కావడం లేదు...
## ఆర్ పి ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 23... కుల, మత, ప్రాంత, లింగ బేధాలు లేకుండా ప్రపంచ మానవులందరికీ సమాన హక్కులను అందించడమే ప్రపంచ మానవ హక్కుల ఒడంబడికలక్ష్యమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఐఎన్హెచ్ఆర్పీసీ) ప్రజల మధ్య అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మెకాస్టార్ ఆడిటోరియంలో ఐఎన్హెచ్ఆర్పీసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ సదస్సుకు బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ దళితులు, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. గౌరవ అతిథిగా హాజరైన ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ లా మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారతదేశంలో ఉన్న కులవివక్షత కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళల మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి హక్కులను పరిరక్షించేందుకు అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాశారని చెప్పారు. కానీ పాలకులు బహుజనుల హక్కుల పరిరక్షణలో విఫలమయ్యారని విమర్శించారు. సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా భారత ప్రజలందరి మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమాలు కొనసాగాలని పిలుపునిచ్చారు. దీనికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్హెచ్ఆర్పీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నవోదయ సిద్ధు, ప్రొఫెసర్ స్వామిదాస్, సైలాబ్బాబు, క్రాంతికిరణ్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార పశు వైద్యశాల 1962 సేవలను పకడ్బందీగా కొనసాగించాలి: డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

### పశువులకు అందని సమాచార వైద్యం మృత్యువాత పడుతున్న మూగజీవాలు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : మూగజీవాలకు వైద్య సేవలు అందించాల్సిన సమాచార వైద్య సేవలు ఎక్కడా కనబడడం లేదు ప్రైవేట్ లో మందులు కొనలేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ గత కొన్ని నెలలుగా సమాచార వైద్య సేవలు నిలిపివేయడంతో పశువులకు కావలసిన టాబ్లెట్స్, టానిక్స్, మందులను ప్రభుత్వం సరఫరా చేయడం లేదని తెలిపారు. నిధుల కొరత పేరిట 1962 అంబులెన్స్ నిర్వహణ ప్రభుత్వం గాలికి వదిలేసిందని అన్నారు. ఉచిత మందులకు మంగళం పాడేశారన్నారు. డాక్టర్ వెళ్లి పశువులకు అవసరమైన మందులకు సంబంధించి చిట్టి రాసిస్తే రైతులు సొంత డబ్బులతో ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారని. ప్రైవేట్ వైద్యులు ట్రీట్మెంట్ చేస్తున్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. రైతులు పశువులకు మందులు కొనలేక సమాచార వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు

## నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్నికైన బీజేపీ పార్టీ శాగ చంద్రశేఖర్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం..



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 23 చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన శాగ చంద్రశేఖర్ రెడ్డి బిజెపి పార్టీ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ పాల్గొని బిజెపి పార్టీ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన శాగ చంద్రశేఖర్ రెడ్డి కి స్వీటు తినిపించి శాలువతో పూలమాలలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాగ చంద్రశేఖర్ రెడ్డి ఎంతో మానవత్వం కలిగిన వ్యక్తి అని ఈ మండలంలో ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ విద్యను క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ ఎంతో మందిని ప్రోత్సహిస్తు ఆదుకుంటున్న వ్యక్తి అని తెలిపారు. ఇలాంటి పదవులు భవిష్యత్తులో మరిన్నో అధిరోహించాలని పేద ప్రజలకు మరింత సేవ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్, మాదిగ జర్నలిస్టుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉదరి శ్యాంసుందర్, ఎమ్మార్పీఎస్ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎర్ర శంకర్, మండల ఉపాధ్యక్షులు చీమకండ్ల శ్రీనివాస్, మాదిగ జర్నలిస్టుల ఫోరం మండల అధ్యక్షులు ఆరుట్ల లింగస్వామి, తాళ్ళసింగారం గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ కిరణ్, నాగారం గ్రామ శాఖ అధ్యక్షులు కుంటి గణేష్, పంతంగి గ్రామ శాఖ అధ్యక్షులు బోయ శ్రావణ్, నాయకులు బోయ సదానందం, అంబేద్కర్ యువజన సంఘం మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు బోదుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రావణమాస ముగింపు వేడుకలు





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 23 : శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రావణమాస ముగింపు ఉత్సవం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రావణమాసం 30 రోజులు దేవాలయంలో ప్రతినిత్యం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం గోత్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించుకుని మొదటి శుక్రవారం కుంకుమార్చన మూడవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించుకోవడం జరిగింది. ఉదయం నుండి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము లక్ష బిల్వార్చన కార్యక్రమం వేద పండితులచే భక్తుల సమక్షంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా చౌటుప్పల ఆర్యవైశ్య సంఘం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిల మురళి సంధ్యా దంపతులు, మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకటరామిరెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గుర్రం వెంకటేష్, వర్కాల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, ఉప్పల కృష్ణ కుసుమ దంపతులు, మంచి కంటి భాస్కర్ గుప్తా ప్రమీల, దంపతులు, సుర్వినరసింహ గౌడ్ ,పాత్రికేయులు సామిడి రాఘవరెడ్డి,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య, డాక్టర్ ఉజ్జీనీ మంజుల,సంద గల విజయ సతీష్ గౌడ్, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, దాచేపల్లి రాజు నాంపల్లి శ్రీనివాస్ దాచేపల్లి శ్రీను, కంశెట్టి వెంకన్న,మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్ పద్మ దంపతులు,కొసనం రామ్ రెడ్డి అనురాధ దంపతులు,బుడిగ బాలకృష్ణ , గుజ్జుల రవీందర్ రెడ్డి, వి ఎల్ కె శ్రీనివాస్ గుప్తా, సింగర్ కొండ శ్రీనివాస్, సముద్రాల వాణి, ఉప్పల కేదార్నాథ్, వీరమల్ల సూర్యనారాయణ, దాడి పద్మ, కీర్తన, పోలోజు జ్యోతి, నిమ్మల ఆండాలు, కాసుల కౌసల్య, వర్కాల మంజుల, పబ్బు మౌనిక, రాజపేట శ్రీలత, బొడ్డు నిర్మల, అరుణ భూపాల్ చారి, తదితర మహిళా భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి: సీఐ మన్మధకుమార్




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 23 : విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చౌటుప్పల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్ అన్నారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు, చౌటుప్పల్ డివిజన్ ఏసిపి పి మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గల గాంధీ పార్క్ లో ఉన్న ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మహిళ సాధికారత అభివృద్ధి కేంద్రం వారి సహకారంతో విద్యార్థులకు సైబర్ క్రైమ్, ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ విచ్చేసి మాట్లాడుతూ.. విద్యార్థులు టెక్నాలజీని మిస్ యూస్ చేయవద్దని, ఆన్లైన్ గేమ్స్ ఆడొద్దని, గుర్తు తెలియని వ్యక్తులతో ఆన్లైన్లో చాట్ చేయొద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన చాక్లెట్స్ గాని, స్వీట్స్ గాని తీసుకోవద్దని అలాంటి వ్యక్తుల బైకులపై ప్రయాణం చేయవద్దని సూచించారు. షీ టీమ్స్, గంజాయి, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి, అదేవిధంగా ఎం ఆధార్ గురించి, పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో మహిళలు టీ ఆప్స్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్-1930, 100 నెంబర్ ద్వారా, మహిళలు 181 నెంబర్ కూడా సమాచారం అందించాలని సూచించారు. వారి పేర్లు గోప్యంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణలో చదువుకొని చదువుకున్న పాఠశాలకు, ఉన్న ఊరికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ భార్గవ్, మహిళ సాధికారత అభివృద్ధి కౌన్సిలర్ అండ్ కోఆర్డినేటర్ శ్రీవాణి, డిస్క్ ఆఫీసర్ ప్రియాంక, కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ సిలివేరు శ్రీనివాస్, శ్రీ చైతన్య పారామెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శేఖర్ రెడ్డి, అధ్యాపక బృందం, తదితర విద్యార్థుల విద్యార్థులు పాల్గొన్నారు..

## సురవరం మరణం వామపక్ష,ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 23ప్రముఖ కమ్యూనిస్టు అగ్రనేత, సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మరణం దేశ వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో,బస్టాండ్ ఎదురుగా కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతు ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమాలతో మొదలైన ఆయన రాజకీయ ప్రయాణం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు ఎక్కడ రాజీ పడకుండా మిలిటెంట్ ఉద్యమాలను రూపొందించడంతో పాటు భారత దేశ వ్యాపితంగా సిపిఐ పార్టీ ప్రజాపోరాటాలను విస్తృతం చేసారని,2012 నుండి 2019 వరకు జాతీయ కార్యదర్శిగా దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని. నల్లగొండ పార్లమెంట్ సభ్యునిగా1998,2004 సంవత్సరాలలో 2 పర్యాయలు ఈ ప్రాంత ప్రజల సమస్యలతో పాటు, దేశంలో ముఖ్యమైన చట్టాలను రూపొంది%ూ%చడంలో సురవరం క్రియాశీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం కోసం పార్లమెంట్ లో కొట్లాడి సాధించిన గొప్ప వ్యక్తి అన్నారు.నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఉద్యమం నిర్వహించారని, ఆయన ఎంపీ ఉన్న సమయంలో డిండి,నక్కలగండి ఎత్తిపోతల సాధన కోసం పాదయాత్ర చేశారన్నారు .ఆయన ఉపన్యాసాలు శత్రువును సైతం మెప్పించేలా ఉండేవని అలాంటి నాయకుడు నేడు మనమధ్య లేకపోడం సిపిఐ పార్టీకి, కమ్యూనిస్ట్ ఉద్యమానికి లోటని వారి స్ఫూర్తిని భావితరాలకు అందేలా అందరు కృషి చేయాలని అన్నారు.సురవరం పార్థివ దేహాన్ని హైదరాబాదులో హిమాయత్ నగర్ లో ముగ్దున్ భవన్ కు రేపు (ఆదివారం) ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రముఖుల, ప్రజల, పార్టీ కార్యకర్తల సందర్శనార్థం ఉంచుతారన్నారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో ర్యాలీగా బయలుదేరి గాంధీ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల పరిశోధనార్థం అప్పజెపుతారని తెలియజేశారులి ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్,టంగుటూరు రాములు,రొండి నర్సింహా,బద్దుల సుధాకర్,దాసరి అంజయ్య, బోయ మంకులు,నీళ్ల బిక్షపతి, రహమాన్, బేధారకోట యాదయ్య,గంగన బోయిన నర్సింహా,ఉబ్బు దర్శన్,మేడి మహేష్,కే ఈశ్వర్, స్వామి,ఆరుట్ల బాబు,బి యాదయ్య,తిరిగి సంజీవ,తదితరులు పాల్గొన్నారు.